# పంజాబ ఆంధ్ర గుజరాత మరాఠా, ద్రావిడ ఉత్కళ వంగ...

మధురాంతకం రాజారాం





పూర్తి పేరు దుర్గావరప్రసాద మల్లికార్జునరావు. సంగ్రహ నామధేయం ప్రసాదరావు. అతనిది విజయవాడ దగ్గర గుడ్లవల్లేరు. వయోజనవిద్యా బోధన నిమిత్తం ఒకసారి బందర్‌లో ఏర్పాటైన శిక్షణా శిబిరంలో అతడూ నేనూ నెలరోజుల పాటు ఒక గదిలో కలిసి వున్నాము.

ప్రసాదరావు చాలా మంచివాడు. ఉదారుడు, స్నేహపాత్రుడు. అన్ని లక్షణాలూ బాగానే వుండేవి గానీ అతనితో వచ్చిన చిక్కే ఒక్కటే! "ఏంటోయ్ వెంకటేశం! మీది చిత్తూరు జిల్లా కదూ! మీరు తెలుగువాళ్లే కారు పోవోయ్!" అనేవాడు. నేను ముఖం చిన్న బుచ్చుకునే వాణ్ణి. "అదేందయ్యా ప్రసాదరావూ! ఇల్లా మమ్మల్ని తీసిపారెయ్యడం నీకు తగునా! చిత్తూరు నుంచి శ్రీకాకుళం దాకా అనం తపురం నుంచి ఆదిలాబాద్ దాకా మనమంతా ఒకటే గదా!" అంటూ నేను గింజుకునే వాణ్ణి.

"కాదులేవోయ్! నేను చెబుతున్నాగా! అసలైన తెలుగువాళ్లనీ కొంచెం నకిలీ తెలుగువాళ్లనీ మన లోనూ రెండు రకాలున్నాయి." అనేవాడు ప్రసాద రావు; అప్పటికింక తన మాటే శిలాశాసనమైనట్లు, దానికి తిరుగులేనట్టు!

"అట్లాగైతే మేము నకిలీ వాళ్లమా నాయనా?" అనే వాణ్ణి నేను దీనంగా.

"కాక! 'వాడు వూడ్చినాడు. వీడు దా వచ్చి




నాడు. కొంచెం ఆ సంగతి చెప్ప మీ!'- ఇదే నటయ్యా తెలుగంటే? అబ్బబ్బ, చెవులు మూసు కోవాలని పిస్తుందనుకో! పోతే సిగ్గు లేకుండా అర వవాడిలా అడ్డపంచ కట్టుకుంటావటయ్యా నువ్వు! నాకు మల్లే గోచీపెట్టి, చెంగులు జీరాడేటట్టుగా పంచగట్టి, లాల్చీ తొడిగి, భుజంపైన కండువా వేసుకునే వాణ్ణి ఒక్కణ్ణి- ఒక్కణ్ణి-చూపించగలవ టయ్యా మీ జిల్లాలో! ఇడ్లీ, సాంబారూ, మెదు వడా తప్పితే పెసరట్టంటే ఏమిటో తెలుసా మీకు? గడ్డ పెరుగుకు, ఆవకాయకు వున్న అనుబంధం ఏమిటో ఎరుగుదురా? కట్టూబొట్టూ, మాటాడే తీరూ, తినే తిండీ-ఇలా ఏ అంశాన్ని బట్టి చూసినా ఆపాదమస్తకం తెలుగువాళ్లం మేము. కావలిస్తే ఈ మాట ఢంకా బజాయించి చెప్పగలను..."

అప్పుడిక నన్ను నేను కాపాడుకోడం కోసం కొంత తర్కబద్ధంగా నా వాదాన్ని మలచుకోవలసి వచ్చేది-" అయ్యా ప్రసాదరావూ! నువ్వువినదలచు కోక పోతే నేనేమీ చెయ్యలేనుగానీ వినదలచు కున్నట్టయితే నా పరిజ్ఞానం అనుమతించినంతలో కొంచెం వివరణ ఇచ్చుకోగలను. మన ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి తమిళ,కన్నడ, మరాఠీ, ఒరియా ప్రాంతాలు సరిహద్దులుగా వున్నాయి. ఈ ద్విభాషా ప్రాంతాల్లో ఆచార వ్యవహారాలు కొద్దిగానో, ఎక్కు వగానో కలగాపులగం కావడం తప్పనిసరి! తెలంగాణా తెలుగువాడి మాటలో ఉర్దూ యాసతప్పదు. కన్నడులు బహుళంగా గుండప్పలు, నంజుండప్పలు గదా! అందువల్ల బెంగుళూరు తెలుగువాళ్లు 'ఏమండప్పా! రండప్పా! కూచోండప్పా!' అంటారు. యావదాంధ్రం లోను చదువుల తల్లి సరస్వతీదేవివున్న ఒకే ఒక ఆలయం ఆదిలాబాదుజిల్లాలో వుంది. అక్కడి ఆంధ్రులు తెలుగు కలిసిన మరాఠీతోను, మరాఠీ కలిసిన తెలుగుతోను మాట్లాడుకుంటారు. ఇటు అరకుగానీ, ఇచ్ఛాపురంగానీ వెళ్ళి చూడు. అక్కడి మన వాళ్ల భాష తెలుగు ఒరియా కలిసిన మణి ప్రవాళంలా వుంటుంది. ఆ మాట కొస్తే వివిధ సంస్కృతుల సమ్మేళనమే గదటయ్యా నేటి మానవ నాగరికత! నువ్వానాడు తెలుగుభాష అనుకునేది ఏనాటి ఏయే భాషల మిశ్రమమో చెప్పగలవా? అట్లాగే ఆచారాలూ వ్యవహారాలూ అన్నీ! సంకరంగాని మతం, సంకరం గాని కులం, సంకరం గాని భాష ఈ ఇలా తలంపైన ఉన్నాయంటావా? పోనీలే, ద్విభాషా ప్రాంతంలో నివసించే మేము అసలు తెలుగు వాళ్ళమైతే కాకపోవచ్చును గానీ, మీకు లేని సదుపాయం మాకొకటి వుంది. మాతృభాషతో బాటుగా మాకు మరొక దేశ భాష సునాయాసంగా అబ్బుతుంది. అందువల్లమాకు విజయవాడ ఎంతో తంజావూరూ అంతే! తల్లి కృష్ణమ్మ ఎంతో అన్నె కావేరీ అంతే! విశ్వనాథవారి 'వేయిపడగ' లెంతో, కల్కిరచన 'శివగామియిన్ శపథమూ' అంతే! నా కత్తికి రెండంచులూ పదునయ్యా ప్రసాదరావ్! నా భాగ్యం తక్కువైందేమీ కాదు. నిజానికి నన్ను జూచి అసూయ పడాలి నువ్వు!" అంటూ నేను గూడా రెచ్చగొట్టడానికి ప్రయత్నించే వాణ్ణి.

అయితే నా హేతువాద మంతా వట్టి అరణ్య రోదనంగా మాత్రమే మిగిలిపొయ్యేది. ప్రసాదరావు అడ్డంగా తలాడిస్తూ "మాటలకేం లేవోయ్! మీకే భాషగానీ సరిగ్గా రాదేమో!" అంటూ తేల్చి పారేసే వాడు.

ఈ వాదం మానదువం ఒక అనుదిన వ్యవహారమై పోయింది. తన వాదానికి తాను, నా వాదానికి నేను కొత్తకొత్త ఆధారాలు సమకూర్చుకునే వాళ్లం. ఎటొచ్చీ దీనికి ముగింపంటూ వుండదు గదా! ఎక్కడో ఒకచోట వాగ్వాదానికి 'సశేషం' పెట్టి "సర్లేవోయ్, నువ్వు లేచి షర్టు వేసుకో! మనం అలా వెళ్లొద్దాం" అనే వాడు ప్రసాదరావు.


హాస్టలు గదిలో నుంచి బయటపడి బజార్లల్లో బలాదూరు తిరిగే వాళ్లం. సినిమాకు కానివ్వు, హోటలుకు కానివ్వు ఎక్కడికి వెళ్లినా అతడు నా జేబులో నుంచి మాత్రం పర్సు నెత్తనిచ్చేవాడు కాడు. "ఉండవోయ్ వెంకటేశం! నువ్వు మా జిల్లా కొచ్చావు గదా! మా కలిథివన్నమాట! వద్దు. నేను చెబుతున్నాగా! పర్సు జేబులో వుంచుకో! నేను మీ వైపు వచ్చినప్పడు నువ్వే ఖర్చు పెడుదువు కానిలే!" అనేవాడు.

శిక్షణ కాలం ముగియడంతోటే మేము విడిపోయాము. దాదావు పదిహేను సంవత్సరాల దాకా మా స్నేహం ఉత్తర ప్రత్యుత్తరాలకు మాత్రమే పరిమితమై పోయింది. ప్రసాదరావు దక్షిణాదికి రావడం మాత్రం తటస్థపడనే లేదు. అలాంటిది ఇటీవల కొద్ది రోజుల క్రిందట సినిమా తీస్తున్న ఓ మిత్రుడి ఆహ్వానంపైన మద్రాసు వెళ్లి, పనిలో పనిగా తమిళదేశంలోని యాత్రాస్థలాలు దర్శించి, తిరుగుదారిలో అతడు మా వూ రొచ్చి దిగేశాడు.

ఉద్వేగ ప్రవృత్తిలో మాత్రం మార్పులేదు. "ఆహా, ఆహా! ఎంత బాగుందోయ్ మీ వూరు!" అంటూనే ఇంట్లో అడుగుపెట్టాడు. "చుట్టూరా కొండలు, మామిడి తోటలు, ముచ్చటగా ఓ ఏరు, దాని గట్ల వెంబడీ కొబ్బరి చెట్లు..."

ప్రసాదరావు ఆగమనం నేను ఎదురు చూచింది గాదు. అతడు తన వెంట తెచ్చుకున్న లగేజిని తీసి బల్లపైన పెడుతూ 'ఎప్పడు, ఎక్కడ, ఏమిటి, ఎలా' లాంటి కుశల ప్రశ్నల్ని గుప్పించేశాను. అతడింకా బదులు చెబుతుండగానే వంటగది వైపు చూస్తూ "ఇదిగో నాగరత్నం!మా ప్రసాదరావు వచ్చేసినాడు" అంటూ కేకపెట్టాను.

"బాగుండారా అన్నా! ఈయన ఎన్నిసార్లు చెప్పినాడో మిమ్మల్ని గురించి! ఇంత కాలానికి




## పి.వి. ఛలోక్తి

ప్రశ్నోత్తరాల సమయంలో ప్రధానికి ప్రశ్న వేసినప్పడు ఆయన సభలో లేకపోవడాన్ని ప్రతిపక్ష సభ్యులు ఉపాధ్యక్షురాలు నజ్మా హెప్తుల్లా దృష్టికి తీసుకువచ్చారు. ఈలోగా నరసింహారావుగారు సభలో ప్రవేశించారు. దీనిపై డాక్టర్ హెప్తుల్లా ప్రధాన మంత్రిగారూ, మీరంటే సభ్యులకు ఎంత ప్రేమోచెప్పలేం. మీరు రావడం ఒక్క నిమిషం ఆలస్యమైనా వారు తాళలేకపోతున్నారు" అని వ్యాఖ్యానించారు. ప్రధాని శ్రీ పి.వి. కూడా వెంటనే ఛలోక్తి విసిరారు. "నేను రావడం మరి కొద్ది నిమిషాలు ఆలస్యం చేసి వుండాల్సింది. అప్పడుసభ్యులు విరహ వేదనతో నా మీద మరింత ప్రేమ కురిపించి వుండేవారు" అని ఆయన అన్నప్పడు సభలో నవ్వులు విరిశాయి.

సేకరణ: భమిడిపాటి వెంకటేశ్వరరావు

మాపైన దయగలిగింది. ఇదిగోండి, మంచినీళ్లు తీసుకోండి!" అంటూ మా ఆవిడ ఎదురొచ్చేసింది.

"అమ్మా, తల్లీ! ఇంటికి మొదటిసారిగా వచ్చిన వ్యక్తిని 'అన్నా' అని ఆప్యాయంగా పలకరించడం మొదటిసారిగా వింటున్నా!" అంటూ ప్రసాదరావు పరవశించిపోయాడు.

కాఫీ మర్యాద గూడా చెల్లించిన తర్వాత స్నానా లగది చూపించాను.

"ఏందేందో చెప్పినారుగానీ, మనిషి చాలా మంచా యనగా వుండాడు గదండీ!" అంది మా ఆవిడ.

"అవునే, నీకట్లనే అనిపిస్తుంది. ఈ మని షిని మెప్పించడం సటువటుమైన పనిగాదు. మన ఆతిథ్యానికి ఎన్ని వంకలు పెడతాడోనని నాకు భయంగా వుంది. నా పరువు నిలబెట్టవలసిన భారం నీదే! ముఖ్యంగా జాగ్రత్త తీసుకోవలసింది వంటల దగ్గ..."

ఇంట్లో ఏది వున్నాయో, ఏది లేదో- లేనివా టిని మా ఆవిడ ఎలా తెప్పించుకుందో- అదంతా నాకేమీ తెలియదు. మేమూ ఇష్టాగోష్టిలో తలము నకలై వుండగానే "ఏమండీ! మాటల్లో పడితే మీకు ఎంత పొద్దయిందీ జ్ఞాపకముండదు. అన్న గారిని పిల్చుకురండి. విస్తర్లు వేసేసినాను" అంటూ పిలువువచ్చింది.

కూచున్నాము.

"ఇదేమిటమ్మా? పప్పుల పొడా! మేం పొడి. 'అనం. 'గుండ' అంటాం. అరరే, చాలా బాగుందే! తరువాత అయిటం ఏమిటి? 'కూర' అని చెప్పి ములగకాడల పులుసు పోశావేమిటమ్మా? మేము తాళింపుల్ని మాత్రమే కూరలంటాం. దివ్యంగా చేశావు గదమ్మా పులుసు! ఏదీ, మరికొంచెం వడ్డించు. ఆహా, రసమంటే ఇలా వుండాలయ్యా వెంకటేశం! పప్పు వేస్తారటమ్మా ఇందులో? దీన్ని 'రసం' అనొచ్చు. వట్టి మిరియాలూ, జీలకర్రావేసి మా వైపు గూడా చేస్తారులే! దాన్ని నేను 'విరసం' అంటుంటాను. అదెక్కడ? ఇదెక్కడ? ఇది అమృతం గదా! చెల్లెమ్మా, దీన్ని కాస్తా గ్లాసులో పోసి ఇస్తావటమ్మా..."

సుష్టుగా భోంచేసి నాలుగంటి దాకా నిద్రపో యాడు ప్రసాదరావు. ఆ తర్వాత కాఫీ సేవించి, 'సైట్ సీయింగు' కంటూ బయల్దేరి ఊరి పరి సరాలపైన పడ్డాడు. ఒక గుట్ట ఎక్కాడు. దాని పైన నిలబడి క్రింద చెరువు నీటిలో తన నీడ చూచుకున్నాడు. అక్కడొక బండపైన కూచుని కొబ్బరితోటల కావల పడమటి కొండల వెనుక సూర్యాస్తమయా న్ని తిలకించాడు. 'ఆహా, ఎంత థ్రిల్లింగ్‌గా వుందయ్యా వెంకటేశం! ఈ గుట్టలు, చిట్టడవులు, కోనలు, చెరువులు చూస్తుంటే కొండ లరాజు కొలువులా వుంది గదయ్యా! ఇలా నిమ్నోన్నతాలుంటేనేనయ్యా అందం! వట్టి మైదా నాల్లో ఏముంటుంది?" అన్నాడు.

"పోనీలే ప్రసాదరావ్! నీకెట్లాగూ మా భాషంటే సరిపడదు. మా ప్రాంతమైనా నచ్చింది చాలు. అదే పది వేలు!" అన్నాను.

"అబ్బే, అదేంలేదు లేవోయ్! ఈ మధ్య విస్తృ తంగా దేశం తిరిగొచ్చాను గదా! నా అభిప్రాయాలు మార్చుకున్నా. మహాకవులు వ్యాకరణ విరు ద్ధమైన ప్రయోగాలు చేస్తారనుకో! ఏమిటిలా చేశారని మనం అడగ్గూడదట! 'మహాకవుల ప్రయోగమ్ములు యథాతథంబుగా గ్రాహ్యంబులు' అంటాడు శాస్త్రజ్ఞుడు. ప్రజల విషయమున్నూ అంతే! 'పదుగురాడు మాట పాడియై ధరచెల్లు' అంటారు గదా! అవును మరి! ప్రజల భాషను తప్పు పట్టడానికి మనమెవరం? ఇప్పుడా పట్టింపులేవీ లేవు. కొంచెం ఆలోచన, కొంచెం వివేచన వచ్చాక అతిశయం గాలిలో బూరగదూదిలా ఎగిరిపోయిం దనుకో!"

మార్పు మానవ స్వభావం. కొందరు బింకానికి పోయి పాత అభిప్రాయాలకే అంటి పెట్టుకున్నట్టు నటిస్తారు. అలా కాకుండా తమ అభిప్రాయాల్లో మార్పు వచ్చినట్టుగా ఒప్పుకోడం ఉత్తమ సంస్కారం లక్షణం. ఆ క్షణాల్లో ప్రసాదరావు వ్యక్తిత్వంపట్ల నాకున్న గౌరవం ఇనుమడించింది.

"ఏమోయ్ వెంకటేశం! అరవం ఒక అక్షర మ్ముక్క అయినా రాకుండా దక్షిణాది అంతా ఎలా తిరిగొచ్చావని అడగవే నువ్వు!" అంటూ మళ్లీ మొదలెట్టేశాడు ప్రసాదరావు. "అక్కడే వుంది కిటుకు. ఒక టూరిస్టుకు కావలసినంత భాషా పరిచయాన్ని నేను సంగ్రహించేశాను. 'ఇంద బస్సు ఎంగెపోదు?' అంటే 'ఈ బస్సు ఎక్కడికి వెళ్తుంది' అన్నమాట! 'కోయిలుక్కు ఎప్పడి పోగణుం?' అంటే 'గుడికెలా వెళ్లాలి' అని అర్థం. 'ఇదు విలై ఎన్న?' అంటే 'దీని ఖరీదెంత' అని భావం. ఇలాంటి పొడి మాటలతోనే కాట్పాడి నుండి కన్యా కుమారి దాకా చక్కర్ కొట్టుకొచ్చేశాను..."

ఆ రోజు రాత్రి మంత్రపేటిక లాంటి తన సూట్ కేసు తెరిచి రకరకాల వస్తువులు పైకి తీశాడు ప్రసాదరావు. పూంబుహార్ లో కొన్న తిరువళ్లువర్ అని చెప్పి ఆ విగ్రహాన్ని నాకిచ్చేశాడు. నాగపట్నంలో కొన్న ముత్యాల గాజుల్ని 'చెల్లెమ్మా! ఇది నీకు' అంటూ మా ఆవిడ చేతుల్లో పెట్టాడు. కంచిప ట్టుచీర పైకి తీసి మా ఆవిడ చేత బాగుందని పించాక 'ఇది మీ వదిన కోసమమ్మా!' అన్నాడు. అల్లాగే తంజావూరు కదిలే బొమ్మ తన మేనకోడలి కనీ, గూడలూరు పనసనార సంచీ తన బాబాయి కనీ, కుంభకోణపు నెమలిదీపం తన కుమార్తెకనీ, యిలా ఎన్నెన్నో వస్తువులు చూపిస్తూ వచ్చాడు.

"మరైతే నీ కోసం నువ్వేమి కొనుక్కున్నా వయ్యా ప్రసాదరావూ?" అని అడిగాను.

"ఇదిగో, ఇది నా కోసం" అంటూ ఓ పుస్తకం తీసి చూపించాడు.

ఆశ్చర్యంతో నేను ఉక్కిరి బిక్కిరైపోయాను.

ఆ పుస్తకం పేరు-

'ముప్పై రోజుల్లో తమిళభాష-తెలుగుద్వారా'.

## పండగ గురుతులు



పండగొచ్చిందంటే చాలు
గంతులేసుకుంటూ మనసు
గతంలోకి పారిపోతుంది
చిన్నప్పటి అనుభవాలతో
మరపురాని గురుతులతో
వయసు మారిపోతుంది.
కుంకుడుకాయ పుల్ల
కంట్లో పడి మండితే
"ఒక్కసారి వుండరా" అని
అమ్మ ముద్దుగా మందలించడం
గురుతొస్తుంది
తోటి పిల్లల కొత్త బట్టల రెపరెపల్ని చూసి
'అమ్మా నాకో' అని అడిగితే
కష్టపడి మిగిల్చిన డబ్బుల్తో కొన్న
కొత్త బనియన్ని తొడిగించి
నన్ను ముద్దెట్టుకున్న
అమ్మ గురుతొస్తుంది
ఆ తర్వాత అమ్మ కళ్ళల్లో
నిండిన కన్నీరు గుర్తొస్తుంది!



భోజనం ముందు
చిగురుటాకులో వడ్డించిన
రెండు బూరె ముక్కల్ని
నోట్లో వేసుకుని
'అమ్మా యింకొంచెం'
అని మారాం చేస్తే



అశక్తతతో
నన్ను హత్తుకున్న
అమ్మ గుర్తొస్తుంది.
భోగి పండుగనాడు
యజమాని యింట్లోంచి
ఏరి తెచ్చుకున్న
రేగిపళ్ళనీ
చిల్లర డబ్బుల్నీ కలిపి
నాకు దిష్టితీసి
వాటిని
నా తలమీద పోసి
నన్ను అక్కున చేర్చుకున్న
అమ్మ గుర్తొస్తుంది
ప్రతిసారీ
ప్రతి పండగకీ
అమ్మని అల్లరిపెట్టిన
నా బాల్యం గురుతొస్తుంది.
ఇప్పుడు కూడా
ప్రతీ ఏడూ
పండుగలొస్తూనే వున్నాయి
కానీ
అమ్మ మాత్రం లేదు!



— డాక్టర్ స్వామి